# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ మంగళవారం 14 జూలై 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 08

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




3లో

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి.

# కేంద్ర సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

## పార్లమెంటులో సమస్యలపై ప్రస్తావించాలి

మెట్రో, ట్రిపుల్ ఆర్ తదితర అంశాలపై అనుమతులు రాబట్టాలి

ఎంపీలతో ప్రజాభవన్‌లో సీఎం రేవంత్ భేటీ

ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరు

సమావేశంలో సలహాదారు జితేందర్ రెడ్డి, ఎంపీలు హాజరు



హైదరాబాద్, జులై 13 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరస్పర సహకారం ఉంటేనే తెలంగాణను అభివృద్ధి పథం వైపు నడిపించగలం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాల్సి ఉందన్నారు. హైదరాబాద్ కు ఎఎఓ ను తీసుకురావాలి. ఇందుకు బీజేపీ ఎంపీలు చొరవ చూపాలన్నారు. మెట్రో విస్తరణకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం. మెట్రో విస్తరణకు సంబంధించి రుణాల పక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చూడాలని అన్నారు. ఆర్ఆర్ఆర్ భూసేకరణ ఒక కొలిక్కి వచ్చింది.. కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుని దాన్ని పూర్తి చేసుకోవాల్సి ఉందన్నారు. మూసీ పునరుజ్జీవానికి సంబంధించి కేంద్రం నుంచి అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కోసం అనుమతులు వచ్చేలా కృషి చేయాలని

-మిగతా 2 లో..

## విద్యార్థుల్లో కులవివక్షను దూరం చేస్తున్నాం

యంగ్ ఇండియా స్కూళ్లతో విద్యాభివృద్ధి

ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాతో సీఎం రేవంత్ రెడ్డి

2లో



02

## బనకచర్లపై నోటీసులు ఇవ్వడం కుదరదు

తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం స్పష్టీకరణ

పిటిషన్‌లో లోపాలు ఉన్నాయని వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 13 : పోలవరం, గోదావరి నీటి వినియోగం, బనకచర్ల అనుసంధానం అంశాలపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. తెలంగాణ వేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వానికి నోటీసులు ఇవ్వాలని, ఇంజక్షన్ ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషన్‌లో కోరింది. తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రధాన పిటిషన్‌లో లోపాలు ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. లోపాలు సరిదిద్దే వరకు విచారణ చేపట్టడం కుదరదని స్పష్టం చేసింది. 15 మంది ప్రతివాదులు ఉన్నారని తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. లోపాలు సరిదిద్దాక విచారణలో మిగతా అంశాలు పరిశీలిస్తామని కోర్టు పేర్కొంది. పిటిషన్‌పై విచారణ జరపకుండా నోటీసులివ్వలేమని తెలిపింది. బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం

-మిగతా 2 లో..





## రాజ్‌కుమార్ ఆత్మహత్య

రంగారెడ్డి జిల్లా పెంజర్ల పొలాల్లో మృతదేహం

స్థానికుల సమాచారంతో రాజ్‌కుమార్ గుర్తింపు

మృతదేహం పక్క పాయిజన్ బాటిల్ లభ్యం

శవం పక్కనే ఫోన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు

హత్యకు ముందు వీడియో కాల్ రికార్డు

రంగారెడ్డి, జూలై 13 : తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన షాబాద్ ఆరు హత్యల కేసులో నరహంతకుడు రాజ్‌కుమార్ (29) మృతి చెందాడు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్లలోని ఓ వెంచర్‌లో అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని రాజ్‌కుమార్‌గా నిర్ధారించారు. మృతదేహం పక్కన పాయిజన్ బాటిల్‌ను గుర్తించారు. నిందితుడు ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. ఓ బాలికను వేధించిన వ్యవహారంలో తనపై పోక్సో కేసు పెట్టారనే కక్షతో రాజ్‌కుమార్ శుక్రవారం అర్ధరాత్రి ఉన్మాదిగా మారి నరమేధం సృష్టించాడు. తొలుత బాలిక తల్లి, నానమ్మలను

-మిగతా 2 లో..

# సుప్రీం సాక్షిగా బయటపడ్డ రేవంత్ వైఫల్యం

బనకచర్లపై పిటిషన్ అంతా తప్పలదడక

గురువు చంద్రబాబు కోసమే డ్రామాలు

మరోమారు మండిపడ్డ బిఆర్ఎస్ నేత హరీష్ రావు

సంగారెడ్డి, జూలై 13 : రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు సుప్రీంకోర్టు సాక్షిగా బయటపడ్డాయని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మొదటి నుంచి రాజకీయ కాంక్ష తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవని ధ్వజమెత్తారు. తన రాజకీయ గురువు చంద్రబాబుకి గురుప్రదక్షిణ చెల్లించుకునేందుకే సీఎం రేవంత్ ఆరాటపడుతున్నారని విమర్శించారు. గోదావరి, నల్లమల కేసులో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి గట్టి మొట్టికాయలు వేసిందని, కావాలనే లోపాలతో కూడిన కేసును వేయడం వల్లే ఈ కేసు నిలువదని ఉన్నత

-మిగతా 2 లో..





## సింగరేణి అధికారుల సమస్యలపై సత్వర నిర్ణయం

సింగరేణి యాజమాన్యానికి భట్టి విక్రమార్క ఆదేశాలు

హైదరాబాద్, జులై 13 : సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న సుమారు 2,200 మంది అధికారులకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై వీలైనంత త్వరగా సానుకూల నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. కోల్ ఇండియా సంస్థల మాదిరిగా సింగరేణి అధికారుల

-మిగతా 2 లో..

# సాధ్యమైనంత మేర గోదావరి జలాల వినియోగం

మేడిగడ్డ వద్ద గేట్లు మూసివేస్తే బ్యారేజీకు ప్రమాదం

నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక మేరకు నడుచుకుంటున్నాం

సమ్మక్క ప్రాజెక్టును సందర్శించిన మంత్రులు

రాష్ట్ర ప్రభుత్వం గోదావరి జలాలను సాధ్యమైనంత మేర వినియోగించుకోవాలని నిర్ణయించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సమక్క బ్యారేజీలో గేట్లు మూసివేయడం వల్ల 71 మీటర్ల ఎత్తులో నీటి నిల్వలు ఉన్నాయని, అందువల్ల దేవాదుల ప్రాజెక్టు ద్వారా 7 మోటార్లతో నీటిని ఎత్తిపోస్తున్నామని చెప్పారు.



ములుగు, జులై 13 : ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమక్క సాగర్ ప్రాజెక్టును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. హెలికాప్టర్‌లో అక్కడికి చేరుకున్న మంత్రులకు జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ లెనిన్ వస్సల్ టోప్పో ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత సమక్క బ్యారేజ్, దేవాదుల ప్రాజెక్టు పనులను పరిశీలించిన మంత్రులు గోదావరి జలాల వినియోగం, కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్ పరిస్థితిపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కన్నెపల్లి పంప్‌హౌస్ ఎందుకు పనిచేయడం లేదని ప్రశ్నించే వారికి వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. మేడిగడ్డ వద్ద గేట్లు మూసివేస్తే బ్యారేజ్‌కు ప్రమాదం ఉందని

-మిగతా 2 లో..

# సిఎం రేవంత్ దిగజారుడు భాష

బూతుపురాణాలు సరికాదు ఎంపి ఈటెల రాజేందర్ హితవు



హైదరాబాద్: రాష్ట్ర చరిత్రలో అత్యంత దిగజారుడు భాష మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి ఒక్కడేనని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. గత కొద్ది రోజులుగా ప్రతిపక్షాలను అందునా బీఆర్ఎస్ లక్ష్యంగా బూతు పురాణం అందుకుంటున్న సీఎం తీరుపై ఆయన స్పందించారు. కన్నెపల్లి పంప్ హౌస్ వద్ద నీళ్లు 94 మీటర్లు లేకున్నా కేవలం రూ.2 కోట్లతో కాఫర్ డ్యామ్ నిర్మించి నీళ్లు లిఫ్ట్ చేయొచ్చు. అది వదిలేసి సలహాలు ఇస్తున్న ఇంజినీర్లను తిట్టడం, బీఆర్ఎస్ నాయకుల రక్తం చిందిస్తా అనడం మూర్ఖత్వమన్నారు. రేవంత్ రెడ్డి నాకు ఎన్‌డీఎస్ఏ చెప్తేనే ప్రాజెక్టుల్లో నీళ్లు నింపుతా అని అజ్ఞానంతో మాట్లాడుతున్నాడు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పిల్లర్లు ఎక్కడా కుంగిపోలేదని, ఎన్‌డీఎస్ఏ రిపోర్ట్ ప్రకారం అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు గ్రౌటింగ్ కూడా చేశారన్నారు. ఎల్ నినో ప్రభావం ఉన్నందున అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో నీళ్ళు నింపుతామని రేవంత్ రెడ్డి ఎన్‌డీఎస్ఏ దగ్గరికి వెళ్ళి అడిగాడా? అని నిలదీశారు. ఇప్పటికైనా భేషజాలకు పోకుండా కాళేశ్వరం జలాలతో ప్రాజెక్టులను నింపి రైతులను ఆదుకోవాలని హితవు పలికారు.



## టీజీటెట్-2026 ఫలితాలు విడుదల

ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక టీజీటెట్

21న విడుదల చేస్తామన్న విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్

02

# ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సన్నద్ధం

మూడు దశల ముందస్తు కార్యాచరణ

ఇక్రిశాట్‌లో శాస్త్రవేత్తలతో మంత్రి తుమ్మల ఉన్నతస్థాయి సమీక్ష

కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండాలి

'రైతు నేస్తం' లో ఎల్-నినోపై రైతులకు ప్రత్యేక అవగాహన

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



02

# కేంద్ర సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. సాగునీటికి సంబంధించి తుంగభద్ర గేట్స్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఆర్ పాటిల్ తో చర్చించాం. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఇవ్వాల్సి ఉంది. డిండి-30 టీఎంసీలకు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు-90 టీఎంసీలకు ఔక్షఅ ఇవ్వాల్సి ఉంది. 120 టీఎంసీలకు కేంద్రం అనుమతులు వస్తే ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసుకోవచ్చు.గోదావరి, కావేరి నదుల అనుసంధానంతో రాష్ట్రానికి ప్రయోజనం ఉంటుంది. కేంద్రం సహకరిస్తే కేంద్రం సహకరించిందని మేం నిరభ్యంతరంగా చెబుతాం. కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని ఒప్పుకునేందుకు మాకు ఎలాంటి భేషజాలు లేవని అన్నారు. తుమ్మిడిహట్టి, పోర్ట్ కనెక్టివిటీ, బుల్లెట్ ట్రైన్, ఆదిలాబాద్, వరంగల్ ఎయిర్ పోర్ట్స్ కు సంబంధించిన అనుమతులు వీలైనంత త్వరగా పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. ఎంపిలతో భేటీలో రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. సమావేశంలో కాంగ్రెస్ ఎంపిలతో పాటు బిజెపి ఎంపిలు ఈటెల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డిలు పాల్గొన్నారు.



## విద్యార్థుల్లో కులవివక్షను దూరం చేస్తున్నాం

### యంగ్ ఇండియా స్కూళ్లతో విద్యాభివృద్ధి

### ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాతో సిఎం రేవంత్

**హైదరాబాద్, జులై 13:** జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. రాష్ట్రంలో విద్యార్థుల మధ్య కుల వివక్షను దూరం చేసేందుకు కీలక చర్యలు చేపట్టామని వ్యాఖ్యానించారు. ప్రతీ నియోజకవర్గంలో 25 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే అకడమిక్ ఇయర్ నుంచి వీటిని అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను అందించేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేశామని సీఎం వ్యాఖ్యానించారు. విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, లంచ్ స్కూల్లోనే అందిస్తున్నామని చెప్పుకొచ్చారు. విద్యార్థులకు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని అన్నారు. కోర్ అర్బన్ రీజియన్ లోపల ఉన్న ప్రాంతంలో మొదటగా వీలైనన్ని తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను పెంచుతున్నామని వివరించారు. రాష్ట్రంలో ఉన్న ఎస్సీలకు వారి జనాభా శాతం కంటే ఎక్కువ అవకాశాలను కల్పిస్తున్నామని సీఎం వెల్లడించారు. రాజకీయాల్లో, ఇతర రంగాల్లో కీలక స్థానాల్లో ఎస్సీలకు అవకాశాలు కల్పించామని వ్యాఖ్యానించారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్నామని తెలిపారు. ఎస్సీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందించేలా చొరవ చూపాలని సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## బనకచర్లపై నోటీసులు ఇవ్వడం కుదరదు

(మొదటిపేజీ తరువాయి)

దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తిని సుప్రీంకోర్టు నిరాకరించింది. జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ సందర్భంగా, ఈ పిటిషన్ నిబంధనలకు విరుద్ధంగా లిస్ట్ అయ్యిందంటూ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఒరిజినల్ సూట్ విషయంలో నిబంధనల ప్రకారమే విచారణకు రావాలని స్పష్టం చేసింది. రిజిస్ట్రీ రూల్స్ ప్రకారం ఇటువంటి ఒరిజినల్ సూట్ పిటిషన్‌ను ముందుగా చాంబర్ జడ్జి ముందు దాఖలు చేయాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఆ ప్రక్రియ పూర్తికాకముందే ప్రతివాదులకు నోటీసులు ఇవ్వకుండా నేరుగా బెంచ్ ముందుకు విచారణకు రావడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. అయితే, అప్పటి వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన వాదనను సుప్రీంకోర్టు పట్టించుకోలేదు.

## టీజీటెట్-2026 ఫలితాలు విడుదల

### ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక టీజీటెట్

### 21న విడుదల చేస్తామన్న విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్



**హైదరాబాద్, జులై 13:** తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష టీజీటెట్-జూన్ 2026 ఫలితాలను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ విడుదల చేశారు. జూన్ 16 నుంచి 22 వరకు కంప్యూటర్ ఆధారిత విధానంలో 10 సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 1,53,752 మంది దరఖాస్తు చేసుకోగా, 1,15,028 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 50,544 మంది అర్హత సాధించగా, మొత్తం ఉత్తీర్ణత శాతం 43.94గా నమోదైంది. పేపర్-1లో ఉత్తీర్ణత శాతం 65.29గా ఉండగా, పేపర్-2 (మ్యాథ్స్ అండ్ సైన్స్)లో 40.76 శాతం, పేపర్-2 (సోషల్ స్టడీస్)లో 25.79 శాతం అభ్యర్థులు అర్హత సాధించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక టీజీటెట్ నోటిఫికేషన్‌ను జూలై 21న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఆ పరీక్షలు సెప్టెంబర్ 7 నుంచి 11 వరకు సీబీటీ విధానంలో నిర్వహించబడతాయి. ఇకపై ప్రతి సంవత్సరం మొత్తం నాలుగు టెట్ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో రెండు ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు, మరో రెండు సాధారణ అభ్యర్థులకు కేటాయించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక టీజీటెట్ నోటిఫికేషన్ జూలై 21న విడుదల కానుంది. ఈ పరీక్షలు సెప్టెంబర్ 7 నుంచి 11 వరకు సీబీటీ విధానంలో నిర్వహించబడతాయి. ఇకపై ప్రతి సంవత్సరం రెండు టెట్‌లు ఇన్‌సర్వీస్ టీచర్లకు, మరో రెండు సాధారణ అభ్యర్థులకు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే మొత్తంగా ఒకే ఏడాదిలో నాలుగు టెట్లు నిర్వహించనున్నారు.

# నరహంతకుడు రాజ్‌కుమార్ ఆత్మహత్య

(మొదటిపేజీ తరువాయి)



కత్తిపోట్లతో కడతేర్చాడు. తర్వాత నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బాలికను గొంతుకోసి చంపేశాడు. అనంతరం ఇంటికెళ్లి భార్య, నిద్రిస్తున్న కన్న బిడ్డల గొంతుకోసి కర్కశంగా హతమార్చాడు. మొత్తం అరగంట వ్యవధిలో మూడు ప్రాంతాల్లో ముగ్గురు మహిళలు, ఓ బాలిక, ఇద్దరు ముక్కుపచ్చలారని చిన్నారుల్ని కిరాతకంగా అంతమొం దించాడు. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు 14 ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. హైదరాబాద్- బెంగళూరు హైవేల్లోని హోటళ్లు, లాడ్జీలు, దాబాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. నిందితుడి కుటుంబసభ్యులు, సన్నిహితులను ప్రశ్నించారు. ఈ క్రమంలో సోమవారం పెంజర్లలో రాజ్‌కుమార్ మృతదేహాన్ని స్థానికులు గుర్తిం చారు. మృతికి ముందు రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. మృతదేహం పక్కన ఉన్న అతడి మొబైల్ ఫోన్‌లో ఈ వీడియోను గుర్తించినట్లు ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి తెలిపారు. రాజ్‌కుమార్‌కు బెట్టింగ్ అలవాటు ఉందని.. దీనికోసం 16 సిమ్‌లు వినియోగించినట్లు చెప్పారు. ఆన్‌లైన్ బెట్టింగ్ కారణంగా అప్పుల బాధతో జీవితంపై విరక్తి కలిగిందని.. ఓ అమ్మాయిని నమ్మి చాలా మోసపోయానని సెల్ఫీ వీడియోలో రాజ్‌కుమార్ పేర్కొన్నాడు. 2.26 సెకన్ల నిడివి గల ఈ వీడియోను మీడియా ప్రతినిధులకు సీపీ చూపించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వీడియో రికార్డు చేసినట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో బాలిక సహా ఆరుగు రిని అత్యంత దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఆ కేసు హంతకుడు రాజ్‌కుమార్ మృతదేహం అతని మేనమామ ఊరు కొత్తూరు మండలం పంజర్లలో లభ్యమైనట్లు చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్ వెల్లడించారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు సమీపంలోని ఓ వెంచర్‌లో అనుమానాస్పద స్థితిలో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ మృతదేహం రాజ్‌కుమార్‌దేనని డీసీపీ ధ్రువీకరించారు. రాజ్‌కుమార్ పాయిజన్ సేవించి ఆత్మహత్య చేసుకున్నాడని డీసీపీ పేర్కొన్నారు. ఘటనాస్థలిలో పాయిజన్ బాటిల్ లభ్యమైందని తెలిపారు. ఆ ఆధారాలను సేకరించిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. కాగా, షాబాద్‌లో జరిగిన ఆరుగురి హత్యల ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టగా, ఈరోజు అతడి మృతదేహం లభ్యమైంది. సంచలనం సృష్టించిన ఆరు హత్యల కేసులో ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్‌కు సంబంధించిన పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. జూన్ 12న పోక్సో కేసులో కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో అతడు కోర్టులో చేసిన వాదనలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. బెయిల్ విచారణ సందర్భంగా.. తనపై నమోదైన పోక్సో కేసు తప్పుడు కేసు అని రాజ్‌కుమార్ కోర్టుకు తెలిపినట్లు సమాచారం. బాధిత బాలిక తండ్రి తన వద్ద అప్పు చేశాడని, ఆ డబ్బులు తిరిగి అడిగినందుకే తనపై కేసు పెట్టారని వాదించాడు. ఫిర్యాదు చేసిన రోజు తాను అక్కడే లేనని, ఆ సమయంలో భార్యతో కలిసి ఆస్పత్రికి వెళ్లినట్లు కోర్టులో తెలిపాడు. దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం.. మైనర్ బాలికకు సంబంధించిన కేసు నమోదైన తర్వాత రాజ్‌కుమార్ కుటుంబంలో విభేదాలు మరింత పెరిగాయి. ఈ వ్యవహారం తర్వాత అతడి భార్య సరిత విడాకులు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. ఇదే విషయంపై రాజ్‌కుమార్ తీవ్ర ఆగ్రహా నికి గురై, పలుమార్లు సరితను చంపేస్తానని బెదిరించినట్లు విచారణ లో వెల్లడైనట్లు తెలుస్తోంది. పోలీసుల దర్యాప్తు ప్రకారం.. హత్యలకు ముందు రాజ్‌కుమార్ సాధారణంగానే వ్యవహరించినట్లు గుర్తించారు. ఘటనకు కొన్ని గంటల ముందు తన కుమారుడితో కలిసి బయటకు వెళ్లి ఆడించడంతో పాటు హెయిర్ కటింగ్ కూడా చేయించినట్లు సమాచారం. అదే రోజు ఉత్సాహంగా ఇంటికి వెళ్లిన తర్వాత కుటుంబ సభ్యులపై దాడి చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

## బాలికను నమ్ముకుని అప్పులపాలయ్యా

### తన పిల్లలకు భూమి లేకుండా చేశా

### సెల్ఫీ వీడియోల నరహంతక రాజకుమార్

**రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఆరు హత్యలకు ముందు రోజు హంతకుడు రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో తీసుకున్నాడని ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి తెలిపారు. అతని మృతదేహం వద్ద లభించిన రాజ్‌కుమార్ సెల్‌ఫోన్‌లో సెల్ఫీ వీడియోను గుర్తించినట్లు పేర్కొన్నారు. వీడియో రికార్డు వివరాల ఆధారంగా హత్యకాండకు ముందురోజు అంటే జులై 10న వీడియో రికార్డు చేసినట్లు గుర్తించామని చెప్పారు. రాజ్‌కుమార్ మొబైల్ ఫోన్‌లో సెల్ఫీ వీడియోలో పలు కీలక అంశాలు ఉన్నాయని తెలిపారు. బాలికను నమ్ముకుని అన్నివిధాలా మోసపోయానని వీడియోలో అతడు తెలిపారని అన్నారు. ఈ కేసుకు సంబంధించిన విషయాలను సీపీ తరుణ్ జోషి మీడియాకు వెల్లడించారు. తాను అప్పులపాలయ్యానని ఈ వీడియోలో చెప్పుకొచ్చినట్లు సమాచారం ఉందని అన్నారు. జీవితం మీద విరక్తి చెందినట్లు నిందితుడు వెల్లడించారని తెలిపారు. తన సంపాదనలో సగం వాళ్లకే పెట్టానని.. తన దగ్గర డబ్బు వసూలు చేసి నష్టపరిచారని అతను ఆ వీడియోలో తెలిపాడని అన్నారు. తన పిల్లలకు భూమి లేకుండా చేసుకున్నానని. ఆ అమ్మాయిని నమ్మి అప్పుల పాలయ్యానని తెలిపారు. చివరకు కేసు పెట్టి జైలుకు పంపాలని చూస్తున్నారని వీడియోలో రాజ్‌కుమార్ రికార్డ్ చేశారని సీపీ తరుణ్ జోషీ వెల్లడించారు.

# సుప్రీం సాక్షిగా బయటపడ్డ రేవంత్ వైఫల్యం

(మొదటిపేజీ తరువాయి)



న్యాయమూర్తులు చెప్పారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏదో చేస్తున్నట్లు చూపించుకోవడానికి కేవలం బ్యాక్ డేట్ ఉత్తరాలు రాసిందని ఎద్దేవా చేశారు. గోదావరి బనకచర్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని మొదటి నుంచి బీఆర్ఎస్ మొత్తుకుంటూనే ఉందని హరీష్ రావు తెలిపారు. చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కు అయ్యారని చెప్పడానికి ఇంకేం ఆధారాలు కావాలి? 'నువ్వు కొట్టినట్టు చెయ్.. నేను తిట్టినట్టు చేస్తా' అన్నట్లుగా రేవంత్ డ్రామాలు ఆడుతున్నారు. రేవంత్ కేవలం ఉద్యమ ద్రోహినే కాదు, తెలంగాణకు జలద్రోహిగా కూడా మారిపోయారు' అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బనకచర్లపై సమావేశానికి వెళ్లనని చెప్పిన రేవంత్, ఆ తర్వాత దొంగచాటుగా వెళ్లారని ఆరోపించారు. పైగా చంద్రబాబుకు అత్యంత నమ్మకస్తుడైన, తెలంగాణ ద్రోహి అయిన ఆదిత్యనాథ్ దాస్‌ను కమిటీలో ఎలా నియమిస్తారని నిలదీశారు. రేవంత్ రెడ్డికి జల వనరులపై అవగాహన తక్కువ, ఆవేశం ఎక్కువ అని హరీష్ రావు ఎద్దేవా చేశారు. గోదావరి నల్లమల సాగర్‌పై ఆంధ్రప్రదేశ్ టెండర్లను 11 డిసెంబర్ 2025 నాడే పూర్తి చేసిందని, దానిపై కాంగ్రెస్ ప్రభుత్వం 16 డిసెంబర్ 2025న రిట్ పిటిషన్ వేసిందని హరీష్ రావు గుర్తుచేశారు. అది డిస్మిస్ అయిన తర్వాత గత 7 నెలలుగా ఈ ప్రభుత్వం ఏం చేస్తూ తమాషాలు చేస్తోందని ప్రశ్నించారు. నిన్న మొన్నటి వరకు రివ్యూలు చేయాల్సిన పాలకులు, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బీఆర్ఎస్‌పై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. కర్ణాటకలో ముగ్గురు సీఎంల అజెండా ఏంటో రేవంత్ రెడ్డి బయటపెట్టాలని డిమాండ్ చేశారు. 'ఎన్ఓసీ' పేరిట తెలంగాణ ప్రయోజనాలను రేవంత్ ఏపీకి అమ్ముకుంటున్నారని, దీనిపై అసెంబ్లీని సమావేశపరిచి చర్చ జరపాలని, దొంగచాటుగా వ్యవహారాలు నడిపితే తాము ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. బనకచర్ల విషయంలో రేవంత్ తీరు అనుమానాస్పదంగా ఉందని, అందుకే ఇవాళ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆ సమావేశానికి వెళ్లలేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో గట్టిగా ప్రశ్నించడం వల్లే ప్రభుత్వం దిగివచ్చి దేవాదుల మోటర్లను ఆన్ చేసిందని హరీష్ రావు స్పష్టం చేశారు. అయితే అక్కడ కూడా 2500 క్యూసెక్కుల నీటిని ఎత్తాల్సి ఉండగా, కేవలం 6 మోటర్లను మాత్రమే నడుపుతు న్నారని విమర్శించారు. సమ్మక్క బ్యారేజీలో నీరు నిల్వ చేసుకుంటే పంపింగ్ చేసుకోవచ్చని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చాలా ముద్దుగా చెబుతున్నారని హరీష్ రావు ఎద్దేవా చేశారు. అసలు ఆ సమ్మక్క బ్యారేజీని నిర్మించింది ఎవరో భట్టి విక్రమార్క సమాధానం చెప్పాలని, కేసీఆర్ హ యాంలో నిర్మించిన ప్రాజెక్టులను వాడుకోవడం కూడా చేతకా క కాంగ్రెస్ నేతలు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు.

# సాధ్యమైనంత మేర గోదావరి జలాల వినియోగం

(మొదటిపేజీ తరువాయి)



నిపుణులు హెచ్చరించారని, వారి సూచనలను పాటిస్తున్నా మని తెలిపారు. పారే నీటినే ఎత్తుకునే అవకాశం ఉంటే మూడు బ్యారేజీలు ఎందుకు నిర్మించారో మాజీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికల ఆధారంగానే ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 22 రిజర్వాయర్ల కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని వెల్లడించారు. సమక్క బ్యారేజ్‌లో నీటిని నిల్వ చేస్తే పంపింగ్ సులభమవుతుందని చెప్పారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం నుంచి ప్రవహించే నీటిని పంపింగ్ చేసే అవకాశం ఉన్నప్పుడు భారీ బ్యారేజీల నిర్మాణం ఎందుకు చేపట్టారో మాజీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, ఇంజినీర్ల సూచనల మేరకే ప్రభుత్వం వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. గతంలో నిర్మించిన అనేక డ్యామ్‌లు సురక్షితంగా ఉండగా.. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన బ్యారేజీలు మాత్రం నాణ్యత సమస్యలతో నిలిచిపో యాయని ఆరోపించారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా సాగు, తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కట్టుబ డి ఉందన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. కాళేశ్వరం నీటిని ఉపయోగించకుండానే గత ఏడాది 84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని చెప్పారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లో నాణ్యత లోపాలు ఉన్నాయని నిపుణుల కమిటీ ఇప్పటికే నివేదించిందని తెలిపారు. మేడిగడ్డ వద్ద నీటిని నిల్వ చేయొ ద్దని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ గత ప్రభుత్వ హయాంలోనే సూచించిందని గుర్తుచేశారు. డిజైన్ మార్పులు, నాణ్యతా లోపాల కారణంగానే ప్రస్తుతం ఈ పరిస్థితి వచ్చిందని ఆరో పించారు. మేడిగడ్డపై ఐఐటీ బాంబే నిపుణులతో పాటు సైన్యం సహకారంతో సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తున్నామని.. మరమ్మతులకు అవసరమైన నివేదికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. దేవాదుల ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇచ్చి పనులు పూర్తి చేస్తున్నామని, ప్రస్తుతం 7 పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నామని చెప్పారు.

# సింగరేణి అధికారుల సమస్యలపై సత్వర నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

వేతన సవరణ, పర్‌ఫార్మెన్స్ రిలేటెడ్ పేమెంట్ అమలుకు సంబంధించి అధికార సంఘం నాయకులు చేసిన విజ్ఞప్తులను ప్రాధాన్యంగా పరిగణించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఇటీవల ప్రజా ప్రభుత్వం ప్రత్యేక చొరవతో తాడిచర్ల-2 బ్లాక్‌కు మైనింగ్ లీజు మంజూరు కావడంలో భట్టి విక్రమార్క పోషించిన కీలక పాత్రకు కృతజ్ఞతలు తెలుపుతూ సింగరేణి అధికార సంఘం నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా అధికారులకు సంబంధించిన వివిధ సమస్యలను త్వరగా పరిష్కరించేలా సింగరేణి యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేయాలని ఆయనను కోరారు. విజ్ఞప్తులపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోమవారం ఉదయం సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ ,గౌతమ్ పోట్రుతో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ప్రజా ప్రభుత్వం సింగరేణి అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ఇంధన భద్రతను అందించడంలో సింగరేణి కార్మికులు, అధికారులు విశేష కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అధికారుల్లో ఎలాంటి అసంతృప్తి నెలకొనకుండా వారి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అధికార సంఘం నాయకులతో చర్చించి వారికి భరోసా కల్పించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఎలాంటి జాప్యం లేకుండా రానున్న రెండు నుంచి మూడు నెలల్లో అధికారుల విజ్ఞప్తులపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, మారుతున్న ప్రపంచీకరణ పరిస్థితులు, పెరుగుతున్న పోటీని దృష్టిలో ఉంచుకొని బొగ్గు ఉత్పత్తి, విక్రయాల్లో సింగరేణి పోటీతత్వాన్ని మరింత పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సింగరేణిని బహుముఖ రంగాల్లో విస్తరించి అంతర్జాతీయ స్థాయి సంస్థగా తీర్చిదిద్దేందుకు అధికారులు కీలక పాత్ర పోషించాలని, ఈ దిశగా అధికార సంఘం నాయకులు కూడా అధికారుల్లో సానుకూల దృక్పథం, కార్యోన్ముఖత పెంపొందించేలా కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. సింగరేణి సుస్థిర భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధనకు కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సింగరేణి అధికార సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది నరసింహులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సన్నద్ధం

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్,జులై13:** ఎల్-నినో ప్రభావాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కొనేలా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఇక్రిశాట్ లో భారత వాతావరణ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌సీడ్స్ రీసెర్చ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మి÷-లలెట్స్ రీసెర్చ్, సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధరంగ ఉన్నతాధికారులతో మంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మూడు దశల కంటింజెన్సీ ప్రణాళికలను ఈ సమావేశంలో సమగ్రంగా పరిశీలించి, శాస్త్రవేత్తలు ఇచ్చిన సూచనలకు అనుగుణంగా తుది కార్యాచరణపై మంత్రి చర్చించారు. ముందుగా వివిధ ఇన్స్టిట్యూషన్స్ నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు ఎల్-నినో పరిస్థితులను తట్టుకునేవిధంగా వారు వారు సిద్ధం చేసిన కార్యచరణను మంత్రికి తెలియచేశారు. ముఖ్యంగా కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు వీలుగా తట్టుకొనే పంటలు మరియు రకాలు, ఇప్పటికే సాగు చేసిన పంటలలో తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక సమర్పించారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, శాస్త్రవేత్తలు సూచించిన ప్రతి యాజమాన్య చర్యను క్షేత్రస్థాయిలో రైతులకు చేరవేసి, జిల్లాల్లో అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అనుబంధరంగ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండి పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. తరువాత మాట్లాడిన వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎల్-నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యమవడం వంటి అవకాశాలను దృష్టిలో పెట్టుకుని జూలై 15, జూలై 30, ఆగస్టు 15 తేదీలను ప్రాతిపదికగా తీసుకుని మూడు దశల్లో రాష్ట్రవ్యాప్త కంటింజెన్సీ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా జిల్లా వారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసినట్లు చెప్పారు. జూలై 15 వరకు వర్షాలు ఆలస్యమైతే 16.30 లక్షల క్వింటాళ్ల విత్తనాలు, జూలై 30 వరకు ఆలస్యమైతే 13.82 లక్షల క్వింటాళ్లు, ఆగస్టు 15 వరకు వర్షాభావ పరిస్థితులు కొనసాగితే 12.70 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేసి ముందుగానే అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వర్షాభావ జిల్లాల్లో జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సంయుక్తంగా పరిస్థితులను సమీక్షిస్తూ అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాల్సిందిగా సూచించారు. శాస్త్రీయ విధానాలతో ఎల్-నినోను ఎదుర్కోవాలని, దీనికి సంబంధించి రాష్ట్రంలో విధానాన్ని అమలు చేయాలని మంత్రి సూచించారు.

వేగుచుక్క

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి.

- ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హెల్త్ కార్డులివ్వాలి.
- జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల మంజూరు వెంటనే ప్రారంభించాలి.
- జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులివ్వాలి.
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర యాక్టింగ్ ప్రెసిడెంట్ పి. రాంచందర్.
- సీఎం రేవంత్ రెడ్డి చొరవ తీసుకోవాలి: హెచ్ యూజే అధ్యక్షుడు అరుణ్ కుమార్.
- హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద జర్నలిస్టుల నిరసన.

**వేగుచుక్క న్యూస్,హైదరాబాద్ జులై 13:**

రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజెఎఫ్) రాష్ట్ర యాక్టింగ్ ప్రెసిడెంట్ పి రాంచందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇస్తామని సీఎం ప్రకటించినప్పటికీ, ఆ ప్రక్రియ ముందుకు సాగటంలేదని అన్నారు. ఇండ్ల జాగల మంజూరుకు సంబంధించి మంత్రివర్గ ఉప సంఘానికి స్పష్టమైన ఆదేశాలివ్వాలని సీఎంను కోరారు. టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం హెచ్ యుజే ఆధ్వర్యంలో హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయం ముందు జర్నలిస్టులు నిరసన కార్యక్రమం నిర్వహించారు.





హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, డీఆర్వో నారాయణని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర యాక్టింగ్ ప్రెసిడెంట్ రాంచందర్ మాట్లాడుతూ... నిబంధనల పేరుతో అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైంది కాదని అన్నారు. అర్హత ఉంటే నిబంధనలను సడలించైనా అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. సబ్ కమిటీ పేరుతో కాలయాపన జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. హెచ్ యూజే అధ్యక్షులు బి అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే జర్నలిస్టులకు ఆరోగ్య కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల విషయంలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకుని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. హెచ్ యూజే కార్యదర్శి బి జగదీశ్వర్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇచ్చిన ఆర్టీసీ బస్ పాస్ లకు సంబందించి 1/3 ఫేర్ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని చెప్పారు. టోల్ చార్జీలు, సెస్ పేరుతో జర్నలిస్టులపై అదనపు భారం పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో జర్నలిస్టులకు ఉచిత ప్రయాణం కల్పించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఇప్పటికే అమలవుతున్న రాష్ట్రాల్లో అధ్యయనం చేయాలని సూచించారు. హైదరాబాద్ లో పని చేస్తున్న జర్నలిస్టులకు మెట్రో రైలులో ఉచిత ప్రయాణం కల్పించాలని కోరారు. హెచ్ యూజే వర్కింగ్ ప్రెసిడెంట్ గంద్ర నవీన్, కోశాధికారి బి రాజశేఖర్ మాట్లాడుతూ.

జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి వాటిని పరిష్కరించాలని అన్నారు. ఈనెల 15న హైదరాబాద్ లో ఐ అండ్ పీఆర్ కమిషనర్ కార్యాలయం వద్ద నిర్వహించే మహా ధర్నాకు రాష్ట్రం నలుమూలల నుంచి జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. డీజేఎఫ్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మస్తాన్ మాట్లాడుతూ జర్నలిస్టులకు అక్రిడీటేషన్ల జారిలో నిర్లక్ష్యం సరికాదన్నారు. హెచ్ యూజే – టీడబ్ల్యూజేఎఫ్ కార్యక్రమాలకు డీజేఎఫ్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. నిరంజన్, జాతీయ కౌన్సిల్ సభ్యులు చిట్యాల మధుకర్, హెచ్ యూజే ఉపాధ్యక్షులు బి దామోదర్, పీ సర్వేశ్వర్ రావు, ఎం రమేష్, జీ వీరేష్, ఎస్ రమేష్, బి కాలేబ్, జీ రేణయ్య, సహాయ కార్యదర్శులు ఎం జీవన్ రెడ్డి, ఎస్ మాధవరెడ్డి, పి లక్ష్మణ్ రావు, కార్యవర్గ సభ్యులు కె లలిత, పీ విజయ, టీ రాజేష్ కుమార్ , బస్వరాజు, రాజశేఖర్, వెంకట్, వినోద్ రావు తదితరులు పాల్గొన్నారు.



# అంకాపూర్ డబుల్ బెడ్ రూమ్ లు హైకోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా కేటాయింపులు.

**- అధికారులపై చర్య తీసుకోవాలి. ఏఐయుకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు వి. ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి బి. దేవారం డిమాండ్.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

అంకాపూర్ డబుల్ బెడ్ రూమ్ లు హైకోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా కేటాయింపులు జరుపుతున్నారని, సంబంధిత అధికారులపై చర్య తీసుకోవాలనీ ఏఐయుకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు వి. ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి బి. దేవారం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంకాపూర్ డబుల్ బెడ్ రూమ్ కేటాయింపులో అర్హులైన వారికి అన్యాయం జరిగిందని, కేవలం ఆర్మూర్ ఎమ్మెల్యే ఆదేశాలను అనుసరించి అంతకు పూర్వం సర్వే చేసి రూపొందించిన లిస్టులను తారుమారు చేశారని అన్నారు. అనేకమందిని తొలగించి, తను ఇష్టం ఉన్నవారికి చేర్చే విధంగా తీసుకున్న నిర్ణయాన్ని పేదల పక్షాన ఆందోళన జరిగిందని అన్నారు. జిల్లాస్థాయి అధికారుల చుట్టూ తిరిగి తిరిగి అధికారులపై నమ్మకాలు సన్నగిల్లి, హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు పరిశీలిస్తూ ప్రస్తుతం ఖాళీ ఉన్న నలుగురికి అర్హులైన లిస్ట్ ప్రకారంగా ఒకటి నుంచి నాలుగో నెంబర్ వరకు ముందు కేటాయించండి అని ఆదేశాలు ఇచ్చింది అని అన్నారు. ఆదేశాలను తుంగలో తొక్కుతూ అర్హులు కాని వారికి తిరిగా నాలుగు ఇండ్లనే కాకుండా మొత్తం కేటాయింపులు ఏ విధంగా జరిగిందని వివరించడానికి ప్రయత్నించగా ప్రజావాణిలో ఉన్న అధికారులు ఏ ఒక్కరికి విషయం తెలియక తిరిగి మమ్మల్ని తాసిల్దార్ని కలవండి అని చెప్పేసి చేతులు దులుపుకోవడంపై విస్మయం వ్యక్తం చేశారు.

**కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై విచారణ జరపాలి.**

కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా ప్రచారం చేసుకుంటున్నా ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఐకెపి. డిసిఎంఎస్, సహకార సంఘాలు కొద్దిమంది రైస్ మిల్ యజమాలతో కుమ్మక్కై ధాన్యం మంచిగా ఉన్న క్వింటాలుకు 10 కిలోల చొప్పున తరుగు పేరుతో రైతుల్ని నిండా ముంచారని ఆవేదన వ్యక్తం చేశారు.
సుమారుగా జిల్లాలో ఏడు లక్షల క్వింటాళ్ల ధాన్యం రైతులకు తోక్రా కుట్టి 200 కోట్ల రూపాయలు నష్టం చేసిందని అన్నారు.రైస్ మిల్ యజమానులు ఒక్క రైతులనే మోసం చేయడం కాదు, ప్రభుత్వాన్ని సైతం వందల కోట్ల రూపాయలు ముంచిందని దీనికి ఉదాహరణకు బోధన్ రైస్ మిల్ యజమానులు ప్రభుత్వానికి ఇవ్వవలసిన బియ్యాన్ని దిగమింగారని, కోట్ల రూపాయలు టోకరా కొట్టారని అన్నారు. ఈ విధంగా జిల్లాలో ఉమ్మడి జిల్లాలో వందల కోట్లు ప్రభుత్వాన్ని నిండా ముంచారని ఈ ఘటనలపై విచారణ జరిపి రికవరీ చేసి రైతులకు ఖాతాలో వెయ్యాలని, ప్రభుత్వ ధనాన్ని సైతం రికవరీ చేసి ప్రభుత్వ ఖజానాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐయుకెఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బి. కిషన్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలపై “ఉద్యమం తీవ్రతరం” చేస్తాం.

**టిడబ్ల్యూ జెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, జిల్లా కార్యదర్శి రాంచందర్ హెచ్చరిక.**

- జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలీ.
- అర్హులైన ప్రతిఒక్కరికి అక్రిడిటేషన్ కార్డులను వెంటనే జారీచేయాలి.
- జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలనీ డిమాండ్.
- టిడబ్ల్యూ జెఎఫ్ ఆధ్వర్యంలో నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**






ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలపై పాలకుల నిర్లక్ష్య వైఖరి వీడాలని, జిల్లా కేంద్రంతో పాటు మండల జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను కేటాయించాలని, టిడబ్ల్యూ జెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, జిల్లా కార్యదర్శి రాంచందర్ డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను త్వరితగతిన జారీ చేయాలని, దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని లేదంటే తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టి డబ్ల్యూ జె ఎఫ్) ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సోమవారం జర్నలిస్టులు నిరసన చేపట్టారు. జర్నలిస్టులపై దాడులు అరికట్టాలని రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కుంచె వెంకటేష్, జిల్లా కార్యదర్శి రాంచందర్, మాట్లాడుతూ, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం జర్నలిస్టులు కృషిచేస్తున్నారని తెలిపారు. ఎండనక, వాననక విధుల్లో ఉంటున్నారనీ, తెలంగాణ ఉద్యమంలోనూ ప్రాణాలకు తెగించి పోరాడారన్నారు. ఉద్యమం సందర్భంగా, ఆ తరువాత కూడా వందలాది మంది చనిపోయారు. పరిస్థితులు మారుతున్నాయి. ప్రభుత్వాల విధానాలు మారిపోతున్నాయి. కానీ, జర్నలిస్టుల బతుకుల్లో మాత్రం ఎలాంటి అభివృద్ధి కనిపించడం లేదన్నారు. ఉన్న రెండు వర్కింగ్ జర్నలిస్టు చట్టాలను యూనియన్ గవర్నమెంట్ కోడ్ల కింద మార్చేసి హక్కులను కాలరాసీ, కార్మిక చట్టాలను తుంగలో తొక్కిందన్నారు. అటు యూనియన్ ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అభివృద్ధి, సంక్షేమ పథకాలను జర్నలిస్టులకు అందడం లేదన్నారు. చివరకు వృత్తి నిర్వహణకు కావాల్సిన అక్రిడిటేషన్ కార్డులు సైతం సకాలంలో ఇవ్వడం లేదనీ, అనేక ఉద్యమాల ఫలితంగా గత రెండు నెలల నుంచి అక్రిడిటేషన్ కార్డులు జారీచేస్తున్నారనీ అన్నారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను త్వరితగతిన జారీచేయాలనీ, అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకూ కార్డు ఇవ్వాలన్నారు. ఒకే యూనియన్ నుంచి ప్రాతినిధ్యం వహించే వారిని అక్రిడిటేషన్ కమిటీల నుంచి తొలగించాలనీ, అందరికి సమాన ప్రాతినిధ్యం కల్పించాలనీ డిమాండ్ చేశారు.

## హెల్త్ కార్డులు తక్షణమే ఇవ్వాలి.

ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నరలిస్టుకూ తక్షణమే హెల్త్ కార్డులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కంట్రిబూషన్ ను ప్రభుత్వమే జర్నలిస్టుల తరపున చెల్లించాలనీ, సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఇండ్లస్థలాలు వెంటనే ఇవ్వాలనీ, యుద్ధప్రాతిపదికన ప్రక్రియకు శ్రీకారం చుట్టి జిల్లా, మండల కేంద్రాల్లో విలేకరులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలనీ. రైల్వే పాసుల పునరుద్ధరణ కోసం మోడీ సర్కార్ పై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలనీ తదితర ప్రధాన డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ భుజంగరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా నాయకులు మధు, అనిత, ప్రవీణ్, అఖిల్, రాజు, కృష్ణ, రాజేందర్, శ్రీకాంత్ గౌడ్, సురేష్, లక్ష్మణ్, ఆనంద్, లక్ష్మణ్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# కిరాతక రాజ్‌కుమార్ అంత్యక్రియలపై సందిగ్ధత

రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో బాలిక సహా ఆరుగురిని అత్యంత దారుణంగా హత్య చేసిన హంతకుడు రాజ్‌కుమార్ మృతదేహం కొత్తూరు సమీపంలో లభ్యమైంది. నిందితుడు మృతదేహానికి సంబంధించిన పోస్టుమార్టం పక్రియ ఇంకా పూర్తికాకపోవడంతో అంత్యక్రియలపై సందిగ్ధత నెలకొంది. ఈ కేసులో మృతురాలు సరిత తల్లిదండ్రులు కీలక డిమాండ్లు చేస్తున్నారు. తమ గ్రామంలోనే రాజ్‌కుమార్ అంత్యక్రియలు నిర్వహించాలని, అలాగే తమ కుమార్తె సరిత, ఇద్దరు మనవళ్ల సమాధుల కాళ్ల వైపు రాజ్‌కుమార్‌ను సమాధి చేయాలని కోరుతున్నారు. అయితే ఈ ప్రతిపాదనను రాజ్‌కుమార్ కుటుంబ సభ్యులు అంగీకరించడం లేదు. మరోవైపు రాజ్‌కుమార్ స్వగ్రామమైన షాబాద్‌లో కూడా అంత్యక్రియలు నిర్వహించడానికి గ్రామస్థులు నిరాకరిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో నిందితుడి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించకుండా పోలీసులు నేరుగా చేవెళ్ల శ్మశానవాటికలోనే దహనం చేయాలని నిందితుడి
తల్లిదండ్రులు, సోదరుడు కోరుతున్నట్లు సమాచారం. నిందితుడు రాజ్‌కుమార్ భార్య సరిత తల్లి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. తన కుమార్తె, ఇద్దరు మనవళ్లను రాజ్‌కుమార్ దారుణంగా హత్య చేశాడని తెలిపారు. పోలీసులు జేసీబీతో గుంతలు తీసి వారిని ఖననం చేశారని చెప్పారు. అదేవిధంగా రాజ్‌కుమార్‌ను కూడా తమ కుమార్తె, మనవళ్ల సమాధుల కాళ్ల వైపు ఖననం చేయాలని కోరారు. వేరే ప్రాంతంలో అంత్యక్రియలు నిర్వహించవద్దని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంపై పోలీసులు న్యాయపరమైన, శాంతిభద్రతల అంశాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. పోస్టుమార్టం నివేదిక అనంతరం అంత్యక్రియలపై తుది నిర్ణయం వెలువడనుంది.

# సాయకృష్ణ కేసు సుప్రీంకు అప్పగింత

అమరావతి: గాదె సాయికృష్ణ అదృశ్యం కేసును సీబీఐకి అప్పగించాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం పై సీబీఐ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసింది. ఈ కేసు అంతర్రాష్ట్ర లేదా అంతర్జాతీయ సంబంధాలపై ప్రభావం చూపేది కాదని సీబీఐ తన వాదనలో పేర్కొంది. ప్రస్తుతం ఏపీ ప్రభుత్వం ఐజీ స్థాయి అధికారి పర్యవేక్షణలో ఈ కేసు దర్యాప్తును చేయిస్తోందని సీబీఐ అధికారులు తెలిపారు. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో సీబీఐ విచారణ అవసరమని చెప్పడానికి తగిన
అసాధారణ పరిస్థితులు లేవని అధికారులు తెలిపారు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన పలు తీర్పులను సీబీఐ అధికారులు ప్రస్తావించారు. అత్యంత అసాధారణమైన పరిస్థితుల్లో మాత్రమే ఆయా కేసులను సీబీఐకి బదిలీ చేయాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసిందని గుర్తుచేశారు.

# మిట్టపల్లి సురేందర్ కు.. “మాభూమి - డా.దాశరథి” ప్రజా సాహిత్య పురస్కారం.

- తెలంగాణను జాగృత పరిచిన కవి దాశరథి.
- విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి.
- కష్ట జీవుల కన్నీళ్లు, కడగల్లే నా పాటకు వస్తువులు.
- పురస్కార గ్రహీత, కవి, గాయకుడు మిట్టపల్లి సురేందర్.

**వేగుచుక్క న్యూస్ , హైదరాబాద్ :**



నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుంచి, తెలంగాణ మలిదశ ఉద్యమం వరకు తెలంగాణను జాగృత పరిచిన గొప్ప కవి దాశరథి అని హైకోర్టు విశ్రాంత న్యాయ మూర్తి జస్టిస్ జి.రాధారాణి అన్నారు. దాశరథి వంటి కవులు ఆ కాలంలో ఉర్దూ చదివినా.. తెలుగును, సంస్కృతిని కాపాడుతూ వచ్చారన్నారు. మా భూమి సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ దాశరథి రంగాచార్య ప్రజా సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ కవి, గాయకుడు మిట్టపల్లి సురేందర్ కు అందజేశారు. ఆదివారం రాత్రి వనస్థలిపురం ఎఫ్ సిఐ కాలనీ కమ్యూనిటీ హాల్లో జరిగిన పురస్కార ప్రదానోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నా తెలంగాణ కోటి రతణాల వీణ అంటూ తెలంగాణ గొప్పదనాన్ని, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు తన సాహిత్యం ద్వారా చెప్పారన్నారు. నాటి నుంచి నేటి వరకు ఆయన రచనలు, పాటలు ఎన్నిసార్లు విన్నా, చదివినా కొత్త గానే ఉంటాయన్నారు. ఆ చల్లని సముద్రగర్భం... పాటతో ప్రపంచ గమనాన్ని తెలియజెప్పారన్నారు. దాశరథి సాహిత్యంలోని ప్రతి పదం గొప్ప సందేశాన్నిస్తుందన్నారు. అంతగొప్ప పురస్కారాన్ని వర్ధమాన కవి, గాయకుడు మిట్టపల్లి సురేందర్కు అందజేయడం సంతోషకరమన్నారు. సురేందర్ రచనలు ప్రజలందరి హృదయాలను స్పృషిస్తాయన్నారు. తల్లి గురించి వారు రాసిన పాట ప్రతి మనస్సును కదిలిస్తుందన్నారు.

**ప్రముఖ నటుడు సుమన్ మాట్లాడుతూ...**

అసలైన హీరోలు బార్డర్లో సైనికులే అని.. దేశ రక్షణలో వారి వల్లే మనం సుఖంగా ఉండగలుగుతున్నామని అన్నారు. కులాలు, మతాలు విడనాడి కలిసిమెలిసి జీవిస్తూ దేశాభివృద్ధికి కృషి చేద్దాం అన్నారు. సాహిత్యం, కలలు ప్రజల్లో సమైక్య భావాన్ని పెంపొందిస్తాయన్నారు. దాశరథి ప్రజా సాహిత్య పురస్కారాన్ని అందుకుంటున్న మిట్టపల్లి సురేందర్ కు అభినందనలు తెలిపారు.

**పురస్కార గ్రహీత మిట్టపల్లి సురేందర్ మాట్లాడుతూ,**

సమాజంలో మన చుట్టూ జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, కష్ట జీవుల కన్నీళు ్ల, కడగల్లే నా పాటకు వస్తువులు అన్నారు. డా దాశరథి సాహిత్యం, రచనలు, పాటలు తెలంగాణ సమాజాన్ని జాగృతం చేయడానికి తోడ్పడినాయన్నారు. నిజాం నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ఎక్కు పెట్టిన వారి కలం స్పూర్తితోనే ఇప్పటికీ ఎప్పటికీ నేను ప్రజల పక్షం నిలుస్తానని అన్నారు. మాభూమి సాహితీ సాంస్కృతిక చైతన్య వేదిక వారు నాకిచ్చిన ఈ దాశరథి సాహిత్య పురస్కారం నాపై బాధ్యత పెంచిందని, ఆ బాధ్యతను దాశరథి, ఇతర ప్రజా కవుల స్పూర్తితో కొనసాగిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అదనపు న్యాయమూర్తి మురళీమోహన్, నరసింహ్మప్రసాద్, యానాల నాగిరెడ్డి, ఉదయశంకర్, అలివేలు మంగ, ఇంజమూరి రఘునందన్, ముసుకు పవన్ కుమార్ రెడ్డి, శరణ్య తదితరులు పాల్గొన్నారు.




# రెండ్రోజుల్లో 37.2 కోట్లు

అక్కినేని అఖిల్ లీడ్ రోల్ లో నటించిన లేటెస్ట్ మూవీ లెనిన్ బాక్సాఫీస్ వద్ద సాలిడ్ గా దూసుకుపోతోంది. దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కించిన ఆ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ అందుకుంది. అదే జోష్ రెండో రోజు కూడా కొనసాగడంతో సినిమా వసూళ్లు మరింత పెరిగాయి. రెండు రోజుల కలెక్షన్లను మూవీ నిర్మాణ సంస్థలు అధికారికంగా అనౌన్స్ చేశాయి. మేకర్స్ వెల్లడించిన వివరాల ప్రకారం, లెనిన్ మూవీ రెండు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.37.2 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించింది. ప్రేక్షకుల నుంచి వస్తున్న పాజిటివ్ టాక్, మౌత్ పబ్లిసిటీ సినిమాకు పెద్ద బలంగా మారిందని మేకర్స్ తెలిపారు. విడుదలైన కొద్ది రోజుల్లోనే ఈ రేంజ్ వసూళ్లు రావడం మూవీ టీమ్ లో ఉత్సాహాన్ని నింపిందనే చెప్పాలి. శుక్రవారం విడుదలైన ఆ సినిమా తొలి రోజే మంచి ఓపెనింగ్స్ నమోదు చేసింది. ఆ తర్వాత శనివారం వీకెండ్ కావడంతో ఫ్యామిలీ ఆడియన్స్ తో యూత్ కూడా థియేటర్లకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యంగా ఈవెనింగ్, నైట్ షోలకు సూపర్ రెస్పాన్స్ కనిపించడంతో ఆక్యుపెన్సీ శాతం కూడా పెరిగినట్లు ట్రేడ్ పండితులు చెబుతున్నారు. అందుకే ఫస్ట్ డే కన్నా రెండు రోజు పెరిగాయని అంటున్నారు. అఖిల్ కెరీర్ లో లెనిన్ సినిమాకు స్పెషల్ ఇంపార్టెన్స్ ఉంది. గత చిత్రాల రిజల్ట్స్ తర్వాత సరైన విజయాన్ని అందుకోవాలన్న టార్గెట్ తో ఆయన ఆ ప్రాజెక్ట్ ను చిన్న గ్యాప్ తర్వాత సెలెక్ట్ చేసుకున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ తో రూపొందిన కథ, మాస్ ఎలిమెంట్స్, ఎమోషన్స్ మిక్స్ చేసిన స్క్రీన్ ప్లే ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయని సినీ ఎక్స్పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు. సినిమాలో అఖిల్ యాక్టింగ్ కు మంచి ప్రశంసలు వస్తున్నాయి. యాక్షన్ తో పాటు ఎమోషనల్ సీన్స్ లో కూడా ఆయన తన పాత్రను సరైన విధంగా డీల్ చేశారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. హీరోనే భాగ్యశ్రీ బోర్సే తన పాత్రకు న్యాయం చేయగా, ఇతర క్యాస్టింగ్ కూడా కథకు బలం చేకూర్చారని ప్రేక్షకులు చెబుతున్నారు. సినిమాలోని ఇంటర్వెల్ ఎపిసోడ్, క్లైమాక్స్ తో పాటు జూనియర్ ఎన్టీఆర్ అందించిన వాయిస్ ఓవర్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటోందని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఆ అంశాలు సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయని చెప్పాలి. దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు కథను కమర్షియల్ అంశాలతో మిక్స్ చేసి తెరకెక్కించిన తీరు సినిమాకు ప్లస్ గా మారిందని సినీ ఎక్స్పర్ట్స్ చెబుతున్నారు. మాస్ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన యాక్షన్ సన్నివేశాలు, కథలోని ట్విస్టులు ప్రేక్షకులను థియేటర్లలో అలరిస్తున్నాయని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.




# 'శ్రీనివాస మంగాపురం' ట్రైలర్ రిలీజ్

ఘట్టమనేని ఫ్యామిలీ నుంచి మరో వారసుడు టాలీవుడ్ ఎంట్రీకి గ్రాండ్‌గా రెడీ అయిపోయాడు. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు అన్న రమేష్ బాబు కుమారుడు జయ కృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయం అవుతున్న లేటెస్ట్ మూవీ 'శ్రీనివాస మంగాపురం'. వైవిధ్యమైన సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న డైరెక్టర్ అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ క్రేజీ ప్రాజెక్ట్ థియేట్రికల్ ట్రైలర్‌ను చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసింది. పక్కా లవ్, యాక్షన్, ఎమోషనల్ ప్యాకేజీలా ఉన్న ఈ ట్రైలర్ సోషల్ మీడియాలో విపరీతమైన వ్యూస్‌తో దూసుకుపోతూ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. అదిరిపోయిన జయ కృష్ణ స్క్రీన్ ప్రెజెన్స్: తొలి సినిమాతోనే జై కృష్ణ ఘట్టమనేని తన లుక్స్, యాక్టింగ్‌తో అందరినీ షాక్ గురిచేశాడు. ఘట్టమనేని వారసుడిగా మంచి కటౌట్‌తో స్క్రీన్ మీద చాలా కాన్ఫిడెంట్‌గా కనిపించాడు. ముఖ్యంగా లవ్ సీన్స్‌లో క్యూట్‌గా నటిస్తూనే.. యాక్షన్ సీక్వెన్స్‌లలో పవర్‌ఫుల్ పర్ఫార్మెన్స్‌తో అదరగొట్టాడు. ఇక డెబ్యూ హీరోలా కాకుండా ఎంతో అనుభవం ఉన్న నటుడిలా బాడీ లాంగ్వేజ్ మెయింటైన్ చేయడం చూసి టాలీవుడ్ వర్గాలు ప్రశంసలు కురిపిస్తున్నాయి.



# తిట్టిపోస్తున్నారు!

ఒక సినిమాకు ముందో హీరోయిన్ని అనుకుని తర్వాత ఇంకో కథానాయికను తీసుకోవడం ఫిలిం ఇండస్ట్రీలో కొత్తేమీ కాదు. ఆ పాత్ర క్లిక్ అయితే, ఆ సినిమా బాగా ఆడితే ముందు అవకాశాన్ని వదులుకున్న హీరోయిన్ అన్ లక్కీ అనుకుంటారు. అంతకుమించి పెద్దగా డిస్కషన్ ఉండదు. కానీ ఇలా ఛాన్స్ మిస్సయిన హీరోయిన్ని అదే పనిగా టార్గెట్ చేస్తూ నెగెటివ్ కామెంట్లు చేస్తుండడమే విడ్డూరం. 'లెనిన్' సినిమాకు ముందు కథానాయికగా ఎంపికై, తర్వాత ఏవో కారణాలతో తప్పుకున్న శ్రీలీల గురించి ఇలాంటి డిస్కషనే నడుస్తోంది సోషల్ మీడియాలో. శ్రీలీల స్థానంలోకి వచ్చిన భాగ్యశ్రీ బోర్సే ఈ అవకాశాన్ని గొప్పగా ఉపయోగించుకుంది. ప్రోమోల్లోనే అందరి దృష్టినీ ఆకర్షించిన భాగ్యశ్రీ.. సినిమాలోనూ ఆకట్టుకుంది. పాటల్లో అందచందలు, డ్యాన్సులతో అదరగొట్టిన భాగ్యశ్రీ.. నటనలోనూ మెప్పించింది. ఓవరాల్‌గా తన పెర్ఫామెన్స్‌కు మంచి స్పందన వస్తోంది. ఇప్పటిదాకా ఒక్క హిట్టూ కొట్టని భాగ్యశ్రీకి 'లెనిన్' ఒక మోస్తరు విజయాన్నందించేలా కనిపిస్తోంది. ఐతే 'లెనిన్' చూసిన వాళ్లు భాగ్యశ్రీని కొనియాడడం వరకు పరిమితం అయితే పర్వాలేదు. కానీ ఇదే సమయంలో శ్రీలీలను టార్గెట్ చేస్తున్నారు. ఆమె భారతి పాత్రను చేసి ఉంటే అది పాడైపోయేదని.. భాగ్యశ్రీలా ఆ పాత్రను పండించేది కాదని.. కీలక సన్నివేశాల్లో తేలిపోయేదని కామెంట్లు చేస్తున్నారు. శ్రీలీలను తప్పించి మంచి పని చేశారంటూ కౌంటర్లు వేస్తున్నారు. ఐతే శ్రీలీల ఎంత కమిటెడ్ యాక్ట్రెస్, ఎంత ప్రొఫెషనల్‌గా, ఉంటుంది, ఎంత అణకువతో వ్యవహరిస్తుంది అన్నది అందరికీ తెలుసు. ఎప్పుడూ యాటిట్యూడ్ చూపించింది .

# ఐటం సాంగ్ సినిమా డీఎన్ఏలో భాగం: మమతా శర్మ

-ఐటమ్ సాంగ్స్-కున్న ప్రాముఖ్యత గురించి చెప్పాల్సిన పనిలేదు. ఇప్పుడంటే కంటెంట్ మోజులో పడి ఐటం పాటల్ని లైట్ తీసుకుంటున్నారు గానీ నాలుగైదేళ్ల క్రితం వరకూ ఐటం పాటలకు ఎలాంటి డిమాండ్ కనిపించిందో చెప్పాల్సిన పనిలేదు. అయితే వీటిపై అదే స్థాయిలో భిన్నమైన అభిప్రాయాలు కూడా లేకపోలేదు. ప్రత్యేకంగా బాలీవుడ్ పరిశ్రమలో ఇలాంటి అభిప్రాయాలు వ్యక్తమవుతుంటాయి. తాజాగా ఈ అంశంపై ప్రముఖ గాయని మమతా శర్మ తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఐటం పాటలు మన సినిమా డీఎన్ఏలో అంతర్భాగంగా పేర్కొన్నారు. కాలంతో పాటు సంగీతం, నృత్యం మారుతున్నప్పటికీ కమర్షియల్ సినిమాల్లో ఎనర్జిటిక్ పాట ఉండాలనే కాన్సెప్ట్ మాత్రం అలాగే ఉందన్నారు. ఈ తరహా పాటలు ప్రేక్షకులకు వినోదాన్ని పంచడమే కాకుండా సినిమాకు ప్రత్యేకమైన హైప్‌ను క్రియేట్ చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. చాలా మంది ఐటం పాటలను గ్లామర్ అంశంగా చూస్తారని కానీ ఒక పాట హిట్ అవ్వాలంటే దాని వెనుక ఎంతో కష్టం ఉంటుందన్నారు. ట్యూన్, సాహిత్యం, గాత్రం అన్నీ కలిస్తేనే ఆ పాట తెరపై మ్యాజిక్‌ను సృష్టిస్తుందన్నారు. కేవలం గ్లామర్ మాత్రమే సినిమాను నిలబెట్టలేదన్నారు. ఐటమ్ సాంగ్స్ పట్ల ఉండే నెగటివిటీని పక్కనపెడితే అవి అందించే వినోద విలువను ఎవరూ కాదనలేరని ఉద్ఘాటించారు. ఒక ఐటమ్ సాంగ్ సినిమా ఫ్లోను ఎలా మారుస్తుందో? గమనించాలని మమతా శర్మ సూచించారు. కథలో కీలక మలుపు దగ్గర ... ప్రేక్షకులు థియేటర్లో బోర్ ఫీలవుతున్న సమయంలో ఇలాంటి ఎనర్జిటిక్ పాటలు కొత్త ఉత్సాహాన్ని నింపుతాయని అభిప్రాయపడ్డారు. మ్యూజికల్ ఫీస్ట్ లాంటి ఈ పాటలు బాక్సాఫీస్ వద్ద సినిమా కలెక్షన్లను ప్రభావితం చేయడంలోనూ ..యూత్‌ను థియేటర్లకు ఆకర్షించడంలోనూ తమవంతు పాత్రను పోషిస్తాయని తెలిపారు.

